

ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి స్థల పరిశీలన

చొప్పదండి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలాన్ని టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్ల బృందం శుక్రవారం పరిశీలించింది. స్కూల్ నిర్మాణానికి ఇటీవల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. ఈ మేకు ఎస్ఈ రవీందర్, ఈఈ అశోక్ కుమార్, ఏఈ మొగ్దుం స్థలాన్ని పరిశీలించారు. త్వరలో పనులను ప్రారంభించనున్నట్లు, స్కూల్ నిర్మాణానికి టెండర్ పూర్తయినట్లు తెలిపారు. అధికారుల వెంట కాంగ్రెస్ నాయకులు ముద్దసాని రంగన్న, కర్రె శ్రీనివాస్ ఉన్నారు.

'స్థానిక' పోరు -2025

విలీన గ్రామాల్లో రాజకీయ స్తబ్ధత





- కార్పొరేషన్‌లో విలీనంతో తగ్గిన పదవులు
- బల్దియా ఎన్నికలపై చర్చలు

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మొన్నటి ఎన్నికల వరకు అవన్నీ గ్రామ పంచాయతీలు... పంచాయతీ ఎన్నికల నగారా మోగితే చాలు... ఎటుచూసినా ఎన్నికల హడావుడి కనిపించేది. ఓవైపు సర్పంచు పదవులను ఆశించేవారు. మరోవైపు వార్డు సభ్యుల పదవులకు పోటీపడే వారు ఓటర్ల వద్దకు వచ్చి మద్దతు కోసం ప్రాధేయపడేవారు. కరీంనగర్‌కు అత్యంత చేరువలో ఉన్న పద్మనగర్, చింతకుంట, మల్కాపూర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్, సదాశివపల్లి, అల్గునూర్ గ్రామపంచాయతీల్లో రాజకీయ హడావుడి మరింత ఎక్కువగా ఉండేది. పేరుకే అవి గ్రామ పంచాయతీలు అయినప్పటికీ అక్కడ అంత నగరీకరణ చోటు చేసుకోవడంతో అక్కడి ఇళ్లు, భూములకు నగరంలోని విలువ ఉండేవి. దీంతో పంచాయతీలకు పోటీ చేసే వారు ఎంత డబ్బైనా ఖర్చు పెట్టేందుకు పోటీపడే వారు. ఇప్పుడు ఆ గ్రామాలన్నీ నగరపాలక సంస్థలోనే విలీనం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికలతో ఆ గ్రామాలకు (విలీన డివిజన్లు) సంబంధం లేకుండా పోయింది. దీంతో ఆయా గ్రామాల్లో రాజకీయ విరామం కొట్టొచ్చినట్లు

(మిగతా 8వ పేజీలో)

చెక్‌డ్యాం పేల్చివేతపై జ్యుడీషియల్ విచారణ జరపాలి

- ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి



కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న ఎమ్మెల్యేలు గంగుల కమలార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు బీఆర్ఎస్ నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): జమ్మికుంట మండలం తనుగుల చెక్‌డ్యామ్‌ను పేల్చేసిన ఘటనపై జ్యూడీషి యల్ విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడుతూ తనుగుల చెక్‌డ్యాం పేల్చివేత ఇసుక మాఫియా పనేనన్నారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు తెప్పించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం చెక్కు చెదరని చెక్‌డ్యాం ఇపుడు ఎలా దెబ్బతిన్నదని ప్రశ్నించారు. ఈ విషయమై శనివారం డీజీపీని కలుస్తామ న్నారు. అక్కడికి జిలెటిన్ స్టిక్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, వారిపై చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు. అనంతరం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ తనుగుల చెక్‌డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారని ఇరిగేషన్ ఏఈ జమ్మికుంట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లాలోని హుస్సేన్‌మియా వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను పేల్చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అప్పుడే నిందితులను అరెస్టు చేసిఉంటే తనుగులలో ఇలాంటి ఘటన జరగకపోయేదన్నారు. పెద్దపల్లి ఎమ్మె ల్యే విజయరమణారావు అది నిజంగా పేల్చినట్లితే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డినే ఏమిటని బారాబర్ మాట్లాడుతానని, విజయరమణారావుఎంత అన్ని అన్నారు. విజయ రమణారావుకు దగ్గరి వారు తనకు ఫోన్లు చేస్తున్నారని, అలాంటి ఫోన్లకు తాను భయపడనని అన్నారు. ఓట్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును పేల్చేశారని ఆరోపించారు. వాటిని కట్టింది రాఘవ కన్‌స్ట్రక్షన్ అని ఇది పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిదని, దానిని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కుమార్ ఈ ఘటనపై సీబీఐ విచారణ వేయించాలన్నారు. కాంగ్రెస్ నాయకుల ఫోన్లకు భయపడేది లేదని, తాను హుందాగా రాజకీయం చేస్తున్నానని, మీకు చేతనైతే హుందాగా రాజకీయం చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నార దాసు లక్ష్మన్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు ఐలేందర్ యాదవ్, ఎడ్ల అశోక్, జంగిలి సాగర్, మాజీ సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజు నామినేషన్ల జోరు

- సర్పంచ్ పదవులకు 197
- వార్డు సభ్యుల స్థానాలకు 543 నామినేషన్లు
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ



చామనపల్లిలో నామినేషన్లు వేసేందుకు వచ్చిన అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్) గ్రామపంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. సర్పంచ్, వార్డుసభ్యుల పదవుల కోసం అన్ని గ్రామాల్లో పోటాపోటీగా నామినేషన్లను దాఖలు చేస్తున్నారు. మొదటి విడతలో జిల్లాలోని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల్లోని 92 సర్పంచ్, 866 వార్డుసభ్యుల పదవులకు ఎన్నికలు జరుగుతున్నాయి. గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా తొలిరోజు సర్పంచ్ పదవులకు 92, వార్డు సభ్యుల పదవులకు 86 నామి నేషన్లు దాఖలయ్యాయి. రెండోరోజు శుక్రవారం సర్పంచ్ పదవులకు 197 మంది నామినేషన్లను దాఖలుచేశారు. 543 మంది వార్డు సభ్యులకు నామినేషన్లను సమ ర్పించారు.

- శుక్రవారం చొప్పదండి మండలంలోని 16 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు 33 నామినేషన్లు, 154 వార్డులకు 69 నామినేషన్లు దాఖలయ్యాయి.

- గంగాధర మండలంలోని 33 గ్రామాల్లో 71 మంది సర్పంచ్ పదవులకు, 296 వార్డులకు 214 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

- రామడుగు మండలంలోని 23 గ్రామాల్లో సర్పంచు పదవులకు 47, 222 వార్డు సభ్యుల పదవులకు 130 నామినేషన్లు దాఖలయ్యాయి.

- కొత్తపల్లి మండలంలోని ఆరు గ్రామాల సర్పంచు స్థానాలకు 21, 62 వార్డు సభ్యుల పదవులకు 67 నామినేషన్లు, కరీంనగర్ రూరల్ మండలంలోని 14 గ్రామాల సర్పంచు పదవులకు 25, 132 వార్డు సభ్యుల స్థానాలకు 63 మంది నామినేషన్లు వేశారు.

రెండురోజుల్లో ఐదు మండలాల్లోని 92 సర్పంచు స్థానాలకు 286 నామినేషన్లు వచ్చాయి. 866 వార్డులకు 629 నామినేషన్లు సమర్పించారు. శనివారంతో నామినేషన్ల గడువు ముగియనున్నది. దీంతో చివరిరోజు నామినేషన్ల అత్యధికంగా వేసే అవకాశాలుంటాయని భావిస్తున్నారు.

స్వామియే శరణం అయ్యప్ప
- దక్షతకు నియమాలతో కూడిన దీక్షలు
- శబరిమల యాత్ర... జాగ్రత్త...
6

విద్యార్థులకు స్కౌట్స్ శిక్షణ
- దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం పెంపు
- పీఎం శ్రీ మోడల్ స్కూళ్లలో యూనిట్ల ఏర్పాటు
7

రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వం బియ్యం సేకరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైస్ మిల్లుల కార్మికులు

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వం బియ్యం సేకరణ ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో, రాష్ట్రంలో రైస్‌మిల్లు కార్మికులు, మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన వ్యవసాయ ఉత్పత్తులైన వరి ధాన్యం కేటాయింపులు, సేకరణకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళిక లేకపోవడంతో అనేక మిల్లులు మూతపడతున్నాయని తెలిపారు. రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ చార్జీలు వంద రూపాయలు ఇవ్వవలసి ఉండగా 30 రూపాయలు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. పదేళ్లుగా చార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు 36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే సేకరించడానికి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్ష్యం విధించిందన్నారు. దానిని 53.6 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరిందని తెలిపారు. కేంద్రం నుంచి ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. వానకాలం పంట దిగుబడి వచ్చినా ఆర్డర్లు లేక రైస్ మిల్లులు నడవడం లేదన్నారు. కార్మికులకు పనులు దొరకడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యు శ్రీనివాస్, కోశాధికారి జి రాజేశం, రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి చల్లా లక్ష్మణ్, దండు నరసయ్య, వెంకటేశం, ఎస్ రమేశ్, చంద్రమౌళి, ఇజ్జగిరి రాజు పాల్గొన్నారు.

మహిళలు శుక్రవారం సభకు హాజరు కావాలి..



శుక్రవారం సభ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాకడే

భగత్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ, గర్భిణి, బాలింత శుక్రవారం సభకు తప్పనిసరిగా హాజరు కావాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే అన్నారు. శుక్రవారం కొత్తపల్లి సెక్టార్, రాజీవ్ గృహకల్ప అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఏమైనా సమస్యలుంటే సభలో తెలపాలన్నారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్ర మంలో మహిళలకు 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత పరీక్షలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు అందుబాటులో ఉన్నాయ న్నారు. ఈ సందర్భంగా శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సరస్వతి, సీడీపీవో సబిత, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అరుణ సతీష్, రాజేందర్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో ఎగిసిపడుతున్న మంటలు

- ఉక్కిరిబిక్కిరవుతున్న వాహనదారులు
- ఆందోళనలో స్థానికులు



డంపింగ్ యార్డులో మంటలు

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డంపింగ్ యార్డు కాలుష్య విషాన్ని చిమ్ముతోంది. గుట్టలు గుటలుగా పేరుకు పోయిన చెత్త తగలబడడంతో శుక్రవారం ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. సాయంత్రం వేళల్లో భారీగా ఎగిసిపడుతున్న మంటలతో స్థానికులు తీవ్రభయాందోళనకు గురికాగా, యార్డు నుంచి వెలువడుతున్న కాలుష్యం, పొగతో వాహనదారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. చెత్త గుట్టను తొలగించేందుకు బయోమైనింగ్ ప్రక్రియ చేపట్టినా అది ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగడంతో సమస్యకు పరిష్కారం లభించడం లేదు. టన్నులకొద్దీ పేరుకుపోయిన చెత్తచెదారం గుట్టపై మంటలు ఆర్పివేస్తున్నప్పటికి కొద్దిసేపటికే మరోచోట నుంచి మంటలు, పొగ వెలువడుతోంది. హైదరాబాద్- రామగుండం బైపాస్ రోడ్డులోని దశాబ్దాల కాలం క్రితం ఏర్పాటు చేసిన ఈ డంపింగ్‌యార్డుకు చెత్తను తగ్గించేందుకు బయోమైనింగ్ చేయాలని నిర్ణయించారు. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా బయోమైనింగ్ ప్రక్రియను ఏడాదిలోగా పూర్తిచేయాలనే ఒప్పందంతో 16.5 కోట్ల రూపాయలకు ప్రాజెక్టు పనులను 2022 ఫిబ్రవరి మాసంలో అప్పగించారు. కొద్దిరోజులు వేగంగా బయోమైనింగ్ ప్రక్రియను కొనసాగించి గత ఏడాది మే నుంచి పూర్తిగా నిలిపివేశారు. మున్సిపల్ అధికారులు ఆ సంస్థకు నోటీసులు ఇవ్వడంతో తిరిగి ఇటీవలనే బయోమైనింగ్ ప్రక్రియ ప్రారంభించారు. కాంట్రాక్టు అప్పగించి దాదాపు రెండేళ్ళు అవుతున్నా నేటికీ గుట్టలు తగ్గడం లేదు. ప్రతీరోజు నగరంలో లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల వరకు చెత్త వెలువడుతోంది. మంటలంతో డంపింగ్ యార్డుకు పరిసరాలైన ఆటోనగర్, అల్గునూర్, సదాశివపల్లి, కోతిరాంపూర్, అలకాపురికాలనీ, కమాన్, సిక్కువాడ వరకు పొగ విస్తరిస్తోంది. దీంతో తాము రోగాలబారిన పడుతున్నామని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా చెత్తను వేగంగా శుద్ధి చేయడంతో పాటు తిరిగి ఇక్కడ చెత్త గుట్ట పేరుకు పోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాలి



మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వార్డు ఆఫీసర్లకు ఇచ్చిన టార్గెట్ మేరకు ఆస్తి పన్నులు వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొండి బకాయిదారుల నుంచి పన్నులు వసూలు చేయాలన్నారు. వారంరోజుల్లో బకాయిలు చెల్లించని వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అయినా పన్నులు చెల్లించకుంటే నల్లా కనెక్షన్ తొలగించాలని, ఆ తర్వాత మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణం లేకుండా ఇంటి నంబర్ ఉంటే గుర్తించి తొలగించాలని ఆదేశించారు. కమర్షియల్ ప్రాపర్టీలపై ప్రధానంగా దృష్టిపెట్టి బకాయిదారుల పన్నులను వసూలు చేయాలని సూచించారు. ఎన్‌పీడీసీఎల్ కమర్షియల్ విద్యుత్ మీటర్లు ఉన్న ప్రాపర్టీల ఆస్తి పన్నులను కమర్షియల్ ట్యాక్స్‌గా మార్చాలని అన్నారు. యూసేజ్ చేంజ్ ఉన్న అండర్ అసెస్‌మెంట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరగా గ్రౌండ్ వర్క్ చేసి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ఖాదర్‌మొహియుద్దీన్, వేణుమాధవ్, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఎంహెచ్‌వో సుమన్ పాల్గొన్నారు.

తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లి మృతిని తట్టుకోలేక తనయుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మంచికట్ల లలిత(56) సిరిసిల్ల పట్టణంలో మానేరు నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది తట్టుకోలేక కుమారుడు మంచికట్ల అభిలాష్(34) అదే మానేరు నదిలో దూకిఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం తండ్రి మంచికట్ల దేవరాజ్ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దేవరాజు పవర్‌లూం కార్మికుడిగా, లలిత బీడీ కార్మికురాలిగా పనిచేస్తూ కొడుకు, ఇద్దరు కూతుళ్లను పోషించారు. కుమారుడు అభిలాష్ కానిస్టేబుల్‌గా 2013 సంవత్సరంలో ఉద్యోగం సాధించాడు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం మంచికట్ల దేవరాజ్ మృతిచెందాడు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిల్లను తల్లి లలిత, కుమారుడు అభిలాష్‌లు చేశారు. వారం రోజులుగా లలిత మానసిక పరిస్థితి బాగాలేదని బంధువులు చెప్పారు. అభిలాష్ విధులకు హాజరై గురువారం ఇంటికి వచ్చేసరికి తల్లి కనిపించక పోవడంతో ఆందోళనకు గురయ్యాడు. మిత్రులతో కలిసి తల్లి ఆచూకీ కోసం వెతికారు. శుక్రవారం మధ్యాహ్నం సిరిసిల్ల ఎల్లమ్మ గుడి సమీపంలో మానేరు నదిలో లలిత మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న అభిలాష్, మిత్రులతో కలిసి మానేరు నది తీరానికి చేరుకుని తల్లి మృతదేహాన్ని చూసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. బంధువులు, మిత్రులు ఓదారుస్తుండగానే ఒక్కసారిగా మానేరు నదిలోకి దూకాడు. మిత్రులకు ఈత రాకపోవడంతో కేకలు వేస్తుండగా అక్కడికి చేరుకున్న పోలీసులు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు చేపట్టారు. పట్టణ సీఐ కృష్ణతో పాటు సిబ్బంది, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సుమారు రెండు గంటల పాటు గాలింపు చేపట్టిన తర్వాత అభిలాష్ మృతదేహం బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంట పొలంపై అడవిపందుల దాడి


పంటను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రంగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంట పొలాలపై అడవిపందులు దాడి చేశాయి. కంటె రెడ్డి అనే రైతుకు చెందిన ఎకరం వరి పంట నష్టం చేయడంతో సుమారు 50 వేల నష్టం జరిగిందని రైతు తెలిపారు. అడవిపందులు, జంతువులు తరచూ పంటపొలాలపై దాడి చేస్తున్నాయని, వాటివల్ల పంట నష్టం అవుతోందన్నారు. గతంలో అడవిపందుల దాడిలో చాలామంది రైతులకు గాయాలు అయ్యాయని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. అడవిపందుల దాడిలో నష్టపోయిన పంటను వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి పరిశీలించి నష్టపరిహారం కోసం సంబంధిత అధికారులకు నివేదిస్తామన్నారు.

- దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం పెంపు
- పీఎం శ్రీ మోడల్ స్కూళ్లలో యూనిట్ల ఏర్పాటు

విద్యార్థులకు స్కౌట్స్ శిక్షణ



ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లె కేజీబీవీలో స్కౌట్స్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

ఇల్లందకుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ, అంకితభావం పెంపొందించేందుకు శిక్షణ ఇవ్వనుంది. శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం, ఉజ్వల భవిష్యత్‌కు ఈ శిక్షణ ఎంతగానో తోడ్పడనుంది. పీఎంశ్రీ మోడల్ స్కూల్, టీఆర్‌ఈఐఎస్ స్కూళ్లతో పాటు కేజీబీవీల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఇల్లందకుంట మండలంలోని మోడల్ స్కూల్‌లో 177 మంది విద్యార్థులు, కేజీబీవీలో 286 మంది విద్యార్థులకు విడతల వారీగా 64మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. ఒక్కో విద్యార్థికి రూ.2 వేల చొప్పున నిధులు మంజూరు చేయగా నిర్వహణకు వెచ్చించనున్నారు.

● చురుకైన బాలికలకు ప్రాధాన్యం

కేజీబీవీల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి బాలికలకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో అవకాశం కల్పిస్తారు. ఇందులో చురుకైన విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేజీబీవీ పాఠశాల నుంచి 32మంది విద్యార్థినిలతో యూనిట్లు ఏర్పాటు చేస్తారు. యూనిట్‌లో చేరే విద్యార్థునులకు ప్రత్యేక యూనిఫామ్ అందజేస్తారు. నిత్యం సాధన, కవాతు, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తారు.

● ప్రతి ఏటా మూల్యాంకనం

స్కౌట్స్ అండ్ గైడ్స్ పనితీరును జిల్లా స్కౌట్స్ కమిషన్ ఏటా మూల్యాంకనం చేస్తారు. మూడేళ్ల శిక్షణ పూర్తయిన తర్వాత రాష్ట్ర గవర్నర్ సంతకంతో కూడిన సర్టిఫికెట్ అందజేస్తారు. నాలుగేళ్లు పూర్తయితే రాష్ట్రపతితో సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

● పాఠశాలల్లో కూడా...

పీఎం శ్రీ పాఠశాలలతో పాటు మోడల్ స్కూళ్లలో కూడా స్కౌట్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఇల్లందకుంట మండలంలోని కేజీబీవీలో 32మంది, మోడల్ స్కూల్‌లో 32మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.

● ప్రయోజనం ఇలా..

స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వం, పట్టు, జట్టు కృషి, నాయకత్వం, సమస్య పరి ష్కారం, విధి నిర్వహణ, క్రమశిక్షణ, సేవ విలువలు పెంపొందుతాయి. క్రమం తప్పకుండా సమాజసేవ ద్వారా పౌరసత్వాన్ని నిర్మిస్తుంది. వారాంతపు బహి రంగ కార్యకలాపాలు శక్తిని మెరుగుపరుస్తాయి. స్క్రీన్ టైం తగ్గించనున్నాయి. బాలికలు వెనుక బడిన నేపథ్యాల నుంచి వచ్చిన పిల్లల్లో సమా నత్వం పెరుగుతుంది. విద్యార్థులు సిబ్బందికి ప్రథ మ చికిత్స, అగ్ని భద్రత, విపత్తు, సంసిద్ధత, పాఠ శాల భద్రత, కసరత్తులో శిక్షణ ఇస్తారు. జీవ వైవి ధ్యం, మ్యాపింగ్, కిచెన్ గార్డెన్, నీటి ఆడిట్, వ్యర్థాల విభజన, వ్యవస్థల్లో పాల్గొనడం పర్యావరణ నిర్వహ ణలలో భాగస్వామ్యం కానున్నారు.

విద్యార్థుల్లో సామాజిక సేవ అలవడుతుంది

– అయిలయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, టేకుర్తి



స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో సామాజిక సేవ అలవడుతుంది. మోడల్ స్కూల్లో 16 బాలురు, 16మంది బాలికలను ఎంపిక చేయడం జరిగింది. దీనికి 64వేల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగింది.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందుతుంది

– లావణ్య, కేజీబీవీ స్పెషలాఫీసర్, శ్రీరాములపల్లె



విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఇవ్వడం ద్వారా దేశభక్తి పెంపొందుతుంది. అంతేకాకుండా క్రమశిక్షణ, అంకితభావం ఏర్పడుతుంది. కేజీబీవీలో 32మంది విద్యార్థులను ఎంపిక చేస్తాం. దీనికి నిధులు కూడా మంజూరయ్యాయి.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి మృతి


రవీందర్‌రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెనుగువారిపల్లె గ్రామానికి చెందిన వంచ రవీందర్‌రెడ్డి (42) అనే యువకుడు మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ద్విచక్రవాహనంపై సిద్దిపేటకు వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా చిన్నకోడూరు మండలం గంగాపూర్ సమీపంలో రోడ్డుపై పోసిన వరిధాన్యం కుప్పపై వాహనం ఎక్కగా కిందపడి మృతిచెందాడు. మృతునికి భార్య సుప్రియ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రవీందర్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

● ఒకరికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లారీ, బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్జంపేట గ్రామానికి చెందిన బూర్క అశోక్ కాల్వశ్రీరాంపూర్‌లోని వార సంతలో కూరగాయలు కొనుగోలు చేసుకొని ద్విచక్రవాహనంపై మీర్జంపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇప్పలపల్లి గ్రామశివారులో ఓ టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అశోక్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే అతన్ని 108లో ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వెంకటేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

ఇంటర్వ్యూ ప్రాణం తీసింది

● 26 సంవత్సరాల ప్రతీకారం ● సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్పీ ● మాజీ నక్సలైట్ సిద్దన్న హత్యోదంతం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

వేములవాడ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్వ్యూ మాజీ నక్సలైట్ ప్రాణం తీసింది. రూ.50వేలు ఇస్తే ఇంటర్వ్యూ ఇస్తానని చెప్పి పిలిచి ప్రాణం తీసుకున్నాడు. వేములవాడ మండలంలోని గుర్రవానిపల్లి ఎదురుగా ఉన్న అగ్రహారం గుట్టల్లో తంగళ్లపల్లి మండలంలోని గండిలచ్చపేట గ్రామానికి చెందిన బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న హత్యకు గురైంది తెలిసిందే. సిద్ధన్న హత్య విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల వేములవాడకు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదుచేసి సిద్ధన్న మృతదేహానికి పంచనామా అనంతరం ఏరియా ఆసుపత్రికి తరలించామని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో గండిలచ్చపేటకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ మహేష్ బి. గీతే సందర్శించి పరిశీలించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో ఉన్న కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడారు. 1990లో పీపుల్స్‌వార్ దళ సభ్యుడిగా చేరిన సిద్ధన్న దళ కమాండర్ స్థాయికి ఎదిగాడు. 2004లో పోలీసులకు లొంగిపోయి స్వగ్రామమైన గండిలచ్చపేటలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. బీఆర్‌ఎస్ పార్టీ క్రియాశీల కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ ప్రాణాలను బలిగొంది.

● తండ్రి హత్యకు తనయుడి ప్రతీకారం

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన జక్కుల అంజయ్య ఇన్‌ఫార్మర్ పేరిట ఏప్రిల్ 9, 1999న అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్ల చేతిలో హత్యకు గురయ్యాడు. దీంతో అంజయ్యకు కుటుంబం వీధినపడింది. అప్పటినుంచి అతడి భార్య, పిల్లలు జగిత్యాలలోనే ఉంటు న్నారు. ఇటీవల ఓ యూట్యూబ్ చానల్‌కు పీపుల్స్‌వార్ మాజీ దళకమాండర్ హోదాలో సిద్ధన్న ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ ఇంటర్వ్యూను చూసిన అంజయ్య కుమారుడు సంతోష్ తన తండ్రి హత్యకు కారణమైన సిద్ధన్నను హతమార్చాలని పథకం వేశాడు. వారం రోజుల క్రితం ఓ యూట్యూబ్ విలేకరిగా సిద్ధన్నకు ఫోన్‌చేసి పరిచయం చేసుకున్నాడు. ఇంటర్వ్యూ ఇవ్వాలని సిద్ధన్నను రెండు మూడు సార్లు కోరినప్పటికీ వీలుకాదని చెప్పిన సిద్ధన్న గురువారం ఇంటర్వ్యూకు వీలవుతుందని చెప్పగానే సంతోష్ జగిత్యాల నుంచి వెంటనే గురువారం సాయంత్రం 5గంటలకు సిరిసిల్లకు చేరుకున్నాడు. జనాల మధ్య సక్రమంగా రాదని గుట్టలు, చెట్లు ఉంటే ఇంటర్వ్యూ బాగుంటుందని సిద్ధన్నను నమ్మించి అగ్రహారం గుట్టల్లోకి తీసుకు వచ్చాడు. అప్పటికే పథకం ప్రకారం సిద్ధన్నకు కల్లు తాగించి బండరాయి తలపై ఎత్తివేసి దారుణంగా హత్యచేశాడు. ఆ తర్వాత మరో బండరాయిని తలపై వేసి సిద్ధన్న చనిపోయినట్లు నిర్ధారించుకొని నేరుగా అగ్రహారం నుంచి జగిత్యాలకు వెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. ఆ తర్వాత వేములవాడ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

స్వగ్రామం చేరిన సిద్ధన్న మృతదేహం

- దుబాయ్ నుంచి బయలుదేరిన కుమారుడు

తంగళ్లపల్లి: హత్యకు గురైన తంగళ్లపల్లి మండలంలోని గండిలచ్చపేట గ్రామానికి చెందిన బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరింది. సిద్ధన్నకు ఇద్దరు భార్యలు పోచవ్వ, ఎల్లవ్వలు, ఇద్దరు కుమారులు అశోక్, నరేశ్, ఒక కూతురు పద్మ ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు అశోక్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. తండ్రి హత్యకు గురైన విషయం తెలుసుకున్న కుమారుడు దుబాయ్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. శనివారం సిద్ధన్న అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆర్టీసీ స్థలం ఆక్రమించే యత్నం.. ఆరుగురిపై కేసు


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై చిరంజీవి

కోరుట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపో స్థలాన్ని కబ్జా చేయయానికి ప్రయత్నించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి శుక్రవారం తెలిపారు. ఆర్టీసీకి సంబంధించిన స్థలంలో రెండు రోజుల నుంచి కోరుట్ల పట్టణానికి చెందిన ఆరుగురు వ్యక్తులు చదును చేసి నిర్మాణం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. డిపో మేనేజర్ మనోహర్ ప్రశ్నిచంగా వారు దురుసుగా ప్రవర్తిచడంతో మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు స్థలం వద్దకు వెళ్లి ఎస్ఐ చిరంజీవి పరిశీలించారు. సరైన దస్తవేజులు లేకపోవ డంతో డిపో మేనేజర్ మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణానికి చెందిన వసుల చిన్ననర్స య్య, అతని భార్య వనిత, అతని కొడుకు నాగరాజు, అంబేద్కర్ నగర్‌కు చెంది న మాగోని మహేందర్, ఆకుల ఆనంద్, పాముల వెంకటరమణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి వివరించారు.

కోరుట్ల బల్దియాలో విజిలెన్స్ తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కోరుట్ల నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బల్దియాలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం కార్యాలయంలోని వివిధ విభాగంలో అధికారులు ఏకకాలంలో దాడులను నిర్వహించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. రిజిస్టర్ బుక్, వాహనాల మరమ్మతులు, డీజిల్ కొనుగోలు బిల్లులకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్‌తో పాటు మున్సిపల్ సిబ్బందిని వివిధ అంశాలపై విచారించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. విజిలెన్స్ తహసీల్దార్ దినేష్ ఉన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు : ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని అందుగులపల్లి గ్రామశివారులో శుక్రవారం ఉదయం అతివేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అందుగులపల్లి గ్రామానికి చెందిన పిడుగు గోపాల్(45) ద్విచక్రవాహనంపై ధర్మారం ఎక్స్‌రోడ్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్దపల్లి వైపు నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న పిడుగు గోపాల్ కిందపడగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

ఫ్లెక్సీ తొలగించారని నిరసన


నిరసన తెలుపుతున్న మృతురాలి కుటుంబ సభ్యులు

కొడిమ్యాల, నవం బరు 28(ఆంధ్ర జ్యోతి): తమ కూతురు తిప్పరవేని మధుశ్రీ శ్రద్ధాంజలి ఫ్లెక్సీని పంచాయతీ సిబ్బంది తొలిగించారని మండల కేంద్రానికి చెందిన తిప్పరవేని మమత నాగరాజు దంపతులు, కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం కొడిమ్యాల కోనాపూర్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురై తమ కూతురు మృతిచెందిన బాధలో ఉంటే పంచాయతీ సిబ్బంది ఫ్లెక్సీ తొలించడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫెక్సీల తొలిగింపులో భాగంగా కొడిమ్యాల గ్రామపంచాయతీ సిబ్బంది ఎన్నికల్లో పాల్గొనే నాయకుడి ఫొటోతో పాటుగా, పలువురు యువకులతో కలిసి ఉన్న ఫ్లెక్సీని తొలిగించకుండా మృతి చెందిన తమ కూతురు ఫ్లెక్సీ ఎందుకు తొలిగించారని అరగంట సేపు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ సౌందర్య, పోలీసులు, గ్రామ కార్యదర్శి ఎల్ వంశీవర్ధన్ సంఘటన స్థలానికి వచ్చి వారిని సమదాయించారు. అనంతరం శ్రద్ధాంజలి ఫ్లెక్సీ తిరిగి ఏర్పాటు చేయించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభ్యంతరం తెలిపిన ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను గ్రామపంచాయతీ సిబ్బంది తొలిగించారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

108 అంబులెన్స్ తనిఖీ

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా కో-ఆర్డినేటర్ కుమారస్వామి తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న మందుల సమాచారం తెలుసుకున్నారు. మెడికల్ ఎక్విప్మెంట్స్ పనితీరుతో పాటు రికార్డులను పరిశీలించారు. ఎమర్జెన్సీ కేసులకు వెంటనే స్పందించాలని ఈఎంటీ ఆరే సతీష్, పైలట్ శ్రీనివాస్‌కు సూచించారు. ధర్మారం, జూలపల్లి మండలాల ప్రజలు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దూర్ డబుల్ బెడ్‌రూం కాలనీవాసుల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న డబుల్‌బెడ్‌రూం కాలనీవాసులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. వారానికి ఒక్కసారి మిషన్‌భగీరథ నీరు వస్తోందని, సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూం కాలనీని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ నాయకులతో కలిసి సందర్శించారు. కాలనీలో సమస్యలను తెలుసుకున్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దూర్ శివారులో 450 డబుల్ బెడ్‌రూంలను నిర్మించి ఎలాంటి వసతులు లేకుండా లబ్ధిదారులకు ఇవ్వడంతో అక్కడ నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులతోపాటు జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కాలనీలో అన్ని వసుతులతో పాటు నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. లేకుంటే మున్సిపాలిటీ ఎదుట కాలనీ ప్రజలతో తరలివచ్చి ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సూరం వినయ్, రచ్చరాహుల్, దేవరాజు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మాజీ కార్పొరేటర్ భార్య మృతి


కుర్ర తిరుమల(ఫైల్

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఎలుకల మందుతాగిన మాజీ కార్పొరేటర్ భార్య కుర్ర తిరుమల(40) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన తిరుమల కడుపునొప్పి భరించలేక ఈ నెల 26న ఎలుకల మందు తాగింది. వెంటనే ఆమె భర్త కుర్రతిరుపతి ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. తిరుమల సోదరుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుబాయ్‌లో రోడ్డు ప్రమాదం

● లక్ష్మీపూర్ వాసి మృతి


గంగాధర్ (ఫైల్)

గొల్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లిన గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గడప గంగాధర్ (45) ఈ నెల 16న దుబాయ్‌లో రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఉన్న ఊరిలో ఉపాధి కరువై ఉపాధి కరువై 18 నెలల క్రితం అప్పులు చేసి గంగాధర్ దుబాయ్ వెళ్లాడు. అక్కడి ఓ ప్రైవేట్ కంపెనీలో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ నెల 16న పనులు ముగించుకుని రూంకు వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు ట్రక్కు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీంతో అక్కడి పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా భద్రపరిచారు. తోటి మిత్రులు 18 రోజుల అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారుడు మహేందర్, కుమార్తె ఆదా ఉన్నారు. మృతదేహంను త్వరగా స్వగ్రామానికి పంపించాలని, బాధిత కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

శంభునిపల్లి శివారులో మృతదేహం లభ్యం

హత్య చేసి గోనె సంచిలో చుట్టినట్లు పోలీసుల గుర్తింపు

జమ్మికుంట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శంభునిపల్లి-తనుగుల గ్రామాల మధ్య శుక్రవారం ఓ మృతదేహం లభ్యమైంది. హత్య చేసి మృతదేహాన్ని గోనె సంచిలో చుట్టి రోడ్డు పక్కన పత్తి చేనులో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. రోడ్డు వెంట దుర్వాసన వస్తుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి చూశారు. గోనెసంచిలో మృతదేహం ఉన్నట్లు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి, పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్, ఎస్ఐలు క్రాంతికుమార్, సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఎదుట గోనె సంచుల నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికీ రెండు, మూడు రోజులు గడిచిపోవడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. తీవ్రగాయాలైన ఆనవాళ్లు సైతం కనిపించాయి. మృతుడు 30-35సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నట్లు గుర్తించారు. చెవిపోగు, మెడలో సిల్వర్ కలర్ చైన్, కుడి చేతికి దేవుడి కంకణాలు, ఎడమ చేతికి రెడ్ కలర్ బ్యాండ్, బ్లాక్ కలర్ బ్యాండ్ ధరించి ఉన్నాయి. ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని పోలీస్‌లు కోరారు. క్లూస్ టీం మృతదేహం నుంచి కొన్ని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు.

డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలం నుంచి పరిమల సొసైటీ రోడ్ వైపు కలివిడిగా తిరిగింది. హంతకులు ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడకు తీసుకు వచ్చి పడేసి, ఆ తర్వాత పరిమల సొసైటీ రోడ్డులో సావీగా మద్యం సేవించినట్లు తెలుస్తోంది. డాగ్‌స్క్వాడ్ ఖాళీ మద్యం బాటిళ్లు ఉన్న వద్ద ఎక్కువ సేపు గడుపడం వల్ల పోలీసులు అనుమా నం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహానికి సంఘటన స్థలం వద్ద పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సర్పంచ్ ఎన్నికలకు 30 గుర్తులు

చొప్పదండి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తులను విడుదల చేసింది. సర్పంచ్ అభ్యర్థుల కోసం 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయించింది.

● సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు

చెప్పులు, చెత్తడబ్బా, బెండకాయ, కొబ్బరితోట, టూత్ పేస్ట్, కత్తెర, ఉంగరం, బ్యాట్, ఫుట్‌బాల్, పర్సు, టీవీ రిమోట్, స్పానర్, బ్లాక్ బోర్డు, డైమండ్, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, మనిషి తెరచాపతో పడవ, బిస్కెట్, గాలి బుడగ, క్రికెట్ స్టంపులు, చైన్, వేణువు కేటాయించగా వార్డు సభ్యులకు అదనంగా మరో 20 గుర్తులను కేటాయించింది.

28 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో రూరల్ మండలంలోని పలు గ్రామాలలో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్న వారితోపాటు ఎన్నికల్లో కేసులు నమోదైన పాత నేరస్థులు, రౌడీ షీటర్లు 28 మందిని శుక్రవారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు, లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి గాయాలు

మల్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొండగట్టుకు చెందిన మనోజ్‌గౌడ్ ద్విచక్రవాహనంపై జగిత్యాల వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న గోగుల రవి ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి.



● దక్షతకు నియమాలతో కూడిన దీక్షలు
● పవిత్ర పదునెట్టాంబడి అధిరోహణ
● శబరిమల యాత్ర... జాగ్రత్త..

స్వామియే శరణం అయ్యప్ప

కరీంనగర్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వామియే శరణం అయ్యప్ప... అంటూ శరణుఘోషలు, భజనలతో పులకరిస్తూ కొనసాగించే అయ్యప్ప దీక్ష పవిత్రమైంది. కఠినమైంది. అనేక నియమ నిబంధనలతో కూడుకున్నది. దీక్షాధారి ఆధ్యాత్మిక, క్రమశిక్షణాయుత జీవితానికి అలవాటు పడుతాడు. దేహమే దేవాలయం, పరిశుభ్రతే పరమాత్మ అని నమ్మి దేహంతో పాటు ఇల్లు, పరిసరాలు, ఆలయాలు శుద్ధిగా ఉంచుకుంటూ దీక్షలు కొనసాగిస్తే దక్షత పెరుగుతుంది. ఆరోగ్యం, ఆధ్యాత్మికత, ప్రశాంతత, సరికొత్త జీవన విధానం ఏర్పడుతాయి. దీక్షల్లో స్థాయిలను బట్టి కన్నె, కత్తి, గంట, గద, గురు స్వాములుగా వ్యవహరిస్తుంటారు. ఏ స్థాయి స్వామి అయినా ప్రతి దీక్షాపరుడు అయ్యప్ప ప్రతిరూపంగా భావిస్తుంటారు. తొలిసారి దీక్షను స్వీకరించే వారు తల్లి లేదా గురుస్వామి చేతుల మీదుగా స్వీకరిస్తారు. దీక్షా కాలంలో నియమ నిబంధనలు, శబరిమల యాత్రా జాగ్రత్తలు తప్పకుండా పాటించాల్సిందే. వాటిని తెలుసుకుందాం.

● దీక్షా నియమాలు



- దీక్షాపరుడు పీఠాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- నలుపు రంగు దుస్తులు ధరించాలి. సంప్రదాయాలను అనుసరించి తిరుమణి, శ్రీచూర్ణం, విభూతి, చందనం, గంధం, కుంకుమ బొట్టు ధరించాలి.
- రెండు పూటలు నిత్య ఆరాధన చేయాలి. తొలిసారి దీక్ష తీసుకున్న వారు పెద్ద పాదం నడవాలి. ప్రతీసారి నడవవచ్చు.
- ఒకే పూట అన్నం, రెండో పూట అల్పాహారం స్వీకరించాలి.
- భూ శయ్య, బ్రహ్మచర్యం పాటించాలి. ఆధ్యాత్మిక పుస్తకాలు చదవాలి.
- పాద రక్షలు ధరించరాదు.
- రక్త సంబంధీకులు, పాలివాళ్ల మరణిస్తే మాల విసర్జన చేయాలి.
- అయ్యప్ప ధ్యానంలో గడపాలి.

● పదునెట్టాంబడి విశేషాలు...

వేద, పురాణ, ఇతిహాసాల్లో ఎన్నో విశేషాలున్నాయి. శబరిమలలో ఆలయానికి వెళ్లాలంటే 18 మెట్లు ఎక్కాలి. ఆ మెట్ల సోపానాన్నే పదునెట్టాంబడి అంటారు. కార్తిక మాసంలో దీక్ష చేపట్టిన దీక్షాపరులు పదునెట్టాంబడిని అధిరోహించి అయ్యప్ప స్వామిని దర్శిస్తారు. సన్నిధానం 18 గొప్ప పర్వతాల మధ్య ఉన్నందుననే 18 మెట్లు వచ్చాయని చెబుతారు.



నియమ నిబంధనలు పాటించాలి

– శ్రీభాష్యం శ్రీనివాసాచార్య గురుస్వామి



దీక్షాధారులు నియమ నిబంధనలు పాటించాలి. ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత ముఖ్యం. భక్తిభావన, ఆధ్యాత్మిక చింతన అవసరం. ఇతరులపై ప్రేమ, సోదరభావం, సహనం, గౌరవం, ఆదరాభిమానాలతో మెలగాలి. మనసారా స్వామిని మదిలో నిలుపుకోవాలి.

ఉమ్మడి జిల్లా పీడీఎస్‌యూ కార్యవర్గం

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా లోకిని రమేశ్, కూతాటి రాణాప్రతాప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీడీఎస్‌యూ నాల్గవ మహాసభల అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతన కమిటీని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కెంసారపు రవితేజ, అంగడి దేవేందర్, ఎండి అస్లామ్, జిల్లా సహాయ కార్యదర్శిగా మేడొడ్డి అజయ్, బుసారపు దిలీప్, అంగిడి దేవేందర్, జిల్లా కోశాధికారి కొయ్యడ రాకేశ్‌తోపాటు 19 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు పీడీఎస్‌యు జాతీయ నాయకులు పి.మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వి శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, రాణాప్రతాప్ మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీఎంబర్సుమెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతూ జిల్లాలో పీడీఎస్‌యును మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని ప్రకటించారు. ఈకార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు మొలుగూరి రాజేశ్, లక్ష్మన్, బొతుకూరి చందు, పొడిశెట్టి అశోక్, కుర్ర అజయ్, సుంకరి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

దుకాణాలను తనిఖీ చేసిన పోలీసులు

కొడిమ్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దకాణాలను ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం రాత్రి కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీ చేసారు. కొడిమ్యాల బస్టాండ్, అంగడిబజార్‌తో పాటుగా ఇతర ప్రధానమైన ప్రదేశాలలో బాంబ్ డిటెక్షన్ టీంతో తనిఖీ చేసారు. కిరాణం దుకాణాలను, టేలాలను ప్రత్యేకంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్. సందీప్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీ చేసామన్నారు. యువత మత్తు పదార్థాలకు రవాణాను అరికట్టడానికి సహకరించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువతను కోరారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శ్రీరాంసాగర్‌లోకి స్వల్పంగా నీరు

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం స్వల్పంగా నీరు వస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 948.168 టీఎంసీల నీరు వచ్చి చేరగా, ప్రాజెక్టు నుంచి 880.455 టీఎంసీల నీరును దిగువకు వదిలారు.

వేములవాడలో భక్తుల రద్దీ

● ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై రాజన్న దర్శనం

వేములవాడ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం దాదాపు 10వేలమంది భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు కోడెల మొక్కులు చెల్లించి అభిషేకం, అన్నపూజ, కళ్యాణాలు, ఇతర అర్జిత పూజలను నిర్వహించారు. ఎల్.ఇ.డి స్ర్కీన్‌లో రాజన్నను దర్శించుకున్న భక్తులను ఆలయ ఇవో రమాదేవి ఆలయ ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఎల్.ఇ.డిలో స్వామివారి దర్శనం ఎలా ఉందని భక్తులను అడిగితే బాగుందని చెప్పారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు బోనం సమర్పించారు.



ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మానకొండూర్‌లో రైతుల రాస్తారోకో

మానకొండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని మార్కెట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసాన్ని నిరసిస్తూ రైతులు శుక్రవరాం ఆందోళనకు దిగారు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. స్థానిక సీఐ సంజీవ్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఒక్కో బస్తాలో 40.600 కిలోలు తూకం వేయాల్సి ఉండగా నిర్వాహకులు బస్తాకు 43 కిలోల తూకం వేస్తున్నారని రైతులు వివరించారు. దీంతో సంబంధిత అధికారులతో మాట్లాడి నిబంధనల ప్రకారం తూకం వేయాలని సూచించారు. అనంతరం రైతులు రాస్తారోకో విరమించారు.



మానకొండూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

సర్పంచ్ పదవి కోసం పెళ్లి

● ఓటరు లిస్టులో పేరు నమోదు కాకపోవడంతో నిరాశ

గంగాధర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవి చేపట్టి గ్రామానికి సేవ చేయాలనే ఆలోచనలో ఉన్న ఓ యువకుడు హుటాహుటిన పెళ్లి చేసుకున్నాడు. అదే రోజు ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఓటరు లిస్టులో భార్య పేరు నమోదు చేసుకునే వీలు లేకుండా పోయింది. ఎంతో ఆశతో సర్పంచ్‌గా పోటీ చేద్దామని పెళ్లి చేసుకున్న దంపతులకు నిరాశే మిగిలింది. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామం సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ మహిళకు రిజ్వర్ చేశారు. గ్రామానికి చెందిన అవివాహితుడైన ముచ్చె శంకర్ తనకు అవకాశం లేకపోవడంతో హుటాహుటిన వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోహెడ మండలానికి చెందిన యువతిని ఈనెల 24న పెళ్లి చేసుకున్నాడు. ఆమెను ఓటరు లిస్టులో చేర్పించి సర్పంచ్‌గా పోటీ చేయించుదామనుకున్నాడు. అదే రోజు సాయంత్రం ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దీంతో శంకర్ భార్య పేరు ఓటరు లిస్టులో చేర్పించే అవకాశం లేకుండా పోయింది. సర్పంచ్‌గా పోటీ చేద్దామనుకున్న ఆ దంపతులకు నిరాశే మిగింది.



శంకర్ దంపతుల పెళ్లి ఫొటో

రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టుకు ఎంపిక

పెగడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెకుముకి టాలెంట్ టెస్టు పోటీల్లో పెగడపల్లి మండలంలోని నామాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి సులోచన తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జనవిజ్ఞాన వేదిక చెక్‌ముకి సైన్స్ సంబరాలు 2025లో భాగంగా శుక్రవారం నిర్వహించిన టాలెంట్ టెస్టులో జిల్లాస్థాయిలో పలు మండలాల నుంచి పాల్గొన్న విద్యార్థులతో పోటీపడి నామాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎం శ్రీవర్ష, ఎ చైత్ర, సీహెచ్ సుస్మిత ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులను అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఈవో రాము అభినందించారు.

కోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

● రూ. 2,73,695 ఆదాయం

వెల్గటూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయం హుండీని శుక్రవారం లెక్కించారు. కార్తీక మాసం ముగిసిన సందర్భంగా హుండీ లెక్కించగా 2,73,695 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కాంతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో స్వామి వారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల భక్తులతో పాటు, ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చినట్లు తెలిపారు. గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారని అన్నారు. కోటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్నిచర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రాజా మొగిలి, ధర్మకర్తలు గుమ్ముల వెంకటేష్ బుద్దె రవి, దేవి లావణ్య, అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, భక్తులు, వెల్గటూర్ సేవా బృందం పాల్గొన్నారు.

కోతిని పట్టు.. సర్పంచ్ సీటు కొట్టు

- పంచాయతీ ఎన్నికల్లో 'కోతి' తిప్పలు
- వానరాల బెడద తీర్చినవారికే ఓట్లు
- గ్రామాల్లో తీర్మానాలు



జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే వారికి కోతులు కొత్త తిప్పలు తెచ్చిపెడుతున్నాయి. గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. దీంతో పలు గ్రామాల్లో కోతుల బెడద తీరిస్తేనే ఓట్లేస్తామంటూ ఓటర్లు అంటున్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్, మంచినీరు, పారిశుధ్యం వంటి సమస్యలను పక్కనబెట్టి కోతులను వెల్లగొడతాం.. ఓట్లేయ్యండి అంటూ ఆశావహులు ప్రచారం మొదలు పెడుతున్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుడి స్థానాలకు పోటీచేసే వారు కోతుల సమస్యే ప్రధానంగా ఎజెండాగా ప్రచారంలో దిగుతున్నారు. కోతుల సమస్య తీర్చేవారినే సర్పంచ్‌గా కానీ, వార్డు సభ్యునిగా కానీ గెలిపిస్తామంటూ ఓటర్లు కూడా తెగేసి చెబుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీచేసే ఆశావహులు కూడా కోతులను పట్టించే పనులపై దృష్టిపెట్టారు. తమను గెలిపిస్తే కోతుల సమస్యను నివారిస్తామని హామీ ఇస్తున్నారు. పలు గ్రామాల్లో ముందుగానే అనధికార తీర్మానాలు చేసుకుంటున్నారు.

● ఎక్కువయిన దాడులు..

గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా కోతుల బెడద ఎక్కువైంది. జిల్లాలో వేల సంఖ్యలో కోతులున్నాయని అంచనా ఉంది. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా కోతులు దాడులు చేస్తున్నాయి. కోతుల దాడిలో గాయపడటంతో పాటు గుంపుగా దాడి చేయడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటున్న సంఘటనలూ ఉన్నాయి. సంవత్సరానికి వంద మందికి పైగా గాయపడుతుండగా, చికిత్స కోసం వేల రూపాయల్లో వ్యయం చేస్తున్నారు. పంట పొలాలను ఇష్టారీతిన నాశనం చేసి రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి.

● తలకు మించిన భారం..

కోతులను పట్టుకోవడానికి మంకీ క్యాచర్లు ఒక్కో కోతికి వెయ్యి రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నారు. అసలే నిధుల కొరత ఉండడంతో చేసేదేమీలేక అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఓటర్లు కూడా తమ సమస్య పరిష్కారానికి పంచాయతీ ఎన్నికలే సరయైన దిగా భావిస్తున్నారు. కోతుల సమస్య తీర్చిన వాళ్లకే తమ ఓట్లు వేస్తా మంటూ షరతులు విధిస్తుండడంతో అభ్యర్థులు కూడా ఆ పనిలో పడ్డారు.

కృత్రిమ మేధస్సుపై జాతీయ సదస్సు



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 4, 5 ఫిబ్రవరి 2026న 'భారత ఆర్థిక వ్యవస్థపై కృత్రిమ మేధస్సు ప్రభావం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కన్వీనర్ అర్థశాస్త్ర విభాగాధిపతి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కోడూరి శ్రీవాణి మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థపై కృత్రిమ మేధస్సు ప్రభావం దాని పర్యవసానాలు అనే అంశాలపై మేధావులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ,పరిశోధకులు, విద్యార్థులు డిసెంబర్ 30లోపు వ్యాసాలను పంపించవచ్చని తెలిపారు. ఉత్తమమైన వ్యాసాలను జర్నల్స్‌లో ప్రచురించనున్నట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు వేడుకకు హాజరైన జిల్లా విద్యాధికారి శారద జిల్లా యువజన క్రీడ అధికారి ఏ సురేష్‌తోకలిసి విజేతలకు బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని 10ఉమ్మడి జిల్లాల నుంచి 244మంది ఈ టోర్నీలో పోటీపడగా లీగ్, సెమీ ఫైనల్స్ అనంతరం ఆరు జట్లు ఫైనల్‌కు చేరాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఫైనల్ మ్యాచుల్లో బాలుర విభాగంలో ఖమ్మం జట్టు మొదటిస్థానం సాధించగా, బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో రెండో స్థానంలో వరంగల్ జట్టు సాధించగా మూడవస్థానంలో రంగారెడ్డి జట్టు నిలిచింది. బాలికల విభాగంలో రెండవ స్థానం మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సాధించగా మూడవ స్థానాన్ని కరీంనగర్ దక్కించుకుంది. పోటీల నిర్వహణకు కృషిచేసిన ఎంఈవో ప్రభాకర్‌ను, టోర్నమెం ట్ ఆర్గనైజర్ బైకని కొమురయ్యను పలువురు అభినందించారు.



విజేతలకు బహుమతుల ప్రదానం

రోడ్డు పనులు చేపట్టాలని రాస్తారోకో

మానకొండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి అన్నారంలో నిలిచిపోయిన రోడ్డు పనులను చేపట్టాలని గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక సీఐ సంజీవ్ అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. అనంతరం కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు మాజీ సర్పంచ్ పప్పు ఆనంద, మాజీ వార్డు సభ్యుడు మేడి కొండయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర చెస్ జట్టు మేనేజర్‌గా రాజమల్లయ్య

కొడిమ్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్(పీడీ) బూట్ల రాజమల్లయ్యను రాష్ట్ర చెస్ జట్టుకు మేనేజర్‌గా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి డాక్టర్ ఎ ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తాలలో ఈ నెల 27నుంచి 30వరకు నిర్వహిస్తున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టుకు మేనేజర్‌గా బాధ్యతలను స్వీకరించారు. శుక్రవారం ఫోన్ ద్వారా రాజమల్లయ్య 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.



రాజమల్లయ్య, పీడీ

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోరుట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్ద వాగు నుంచి ఇసుక అక్రమంగా డంపు చేస్తున్న మూడు ఇసుక బ్లెడ్ ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. స్థానిక వాగులోని బతుమ్మ గాటు సమీపంలో వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. మూడు బ్లేడ్ ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాయంకు తరలించి సీజ్ చేసినట్లు ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు. కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కరీంనగర్‌లో..

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ బస్టాప్ వద్ద అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ గొల్లపల్లికి చెందిన కొత్తూరి కొంరయ్యపై కేసు నమోదు చేశామని, ట్రాక్టర్‌ను సీజ్ చేశామని పేర్కొన్నారు.

జ్యోతిబాఫూలేకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాఫూలే వర్ధంతిని శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పులి అంజనేయులుగౌడ్, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయంతోపాటు నగరంలోని శాతవాహన యూనివర్సిటీ మహాత్మ జ్యోతిబాఫూలే విగ్రహం వద్ద నాయకులు నివాళుల ర్పించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ కార్పొ రేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: కోతిరాంపూర్‌లోని మహాత్మా జ్యోతిబాఫూలే విగ్రహం వద్ద తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లంలింగమూర్తి శుక్రవారం నివాళులర్పించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి కాల్వ మధు బాబు. తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వర్. మహాత్మా జ్యోతిరావు ఫూలే సంఘం అధ్యక్షులు శంకర్. మధు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముకరంపుర జ్యోతిబాఫూలే మైదానంలో నివాళి అర్పించారు. సంఘం సీనియర్ నాయకుడు కేశిపెద్ది శ్రీధర్ రాజు, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, నారోజు రాకేష్‌చారి పాల్గొన్నారు.

● శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత ఆధ్వర్యంలో జ్యోతిబాఫూలేకు నివాళులర్పించారు.

● ఫూలే బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వంగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కోతిరాంపూర్ బైపాస్ రోడ్డు వద్ద ఫూలే విగ్రహం వద్ద రాష్ట్రకార్యదర్శి కడారి ఐలయ్య, యూత్ ప్రెసిడెంట్ అనుమాస నితిన్ కుమార్, ఎన్నం ప్రకాష్ పాల్గొన్నారు.

● తెలంగాణ చౌక్‌లో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి వినయ్‌సాగర్ ఫూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదుట ఉన్న చౌరస్తా వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహోన్నతమైన వ్యక్తి మహాత్మా జ్యోతిబాఫూలే అని కొనియాడారు. ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న వొడితెల ప్రణవ్

విలీన గ్రామాల్లో రాజకీయ స్తబ్ధత

(5వ పేజీ తరువాయి)

కనిపిస్తోంది. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల పరిధిలోని ఈ గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో మండలాల్లో గ్రామాల సంఖ్య భారీగా తగ్గిపోయింది. కార్పొరేషన్‌లో డివిజన్ల సంఖ్య 66కు చేరింది.

● విలీనం వద్దు... గ్రామపంచాయతీలే ముద్దు

కార్పొరేషన్‌లో విలీనం చేయవద్దంటూ ప్రజలు వ్యతిరేకించినప్పటికీ నగరీకరణలో భాగంగా సమీపంలోని గ్రామాలను విలీనం చేశారు. గ్రామాల విలీనంతో తమకు పన్నుల భారమే తప్ప అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఒరిగిందేమి లేదని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీలు ఉంటే ఒక్కో గ్రామంలో 5,6 నుంచి 10 వార్డు సభ్యులు, సర్పంచు, ఉపసర్పంచు పదవులు ఉండేవి. ఎంపీటీసీ, మండల స్థాయిలో జడ్పీటీసీ పదవులు ఉండేవి. కార్పొరేషన్‌లో విలీనంతో ఆ పదవులన్నీ పోయి పంచాయతీ పరిధిలో ఒక్క కార్పొరేటర్ పదవి మాత్రమే దక్కుతుందని రాజకీయ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థాయిని బట్టి ఎవరి హోదాలో వారు వార్డు సభ్యులు, సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులకు పోటీపడే వారమని, ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. దాదాపు ఐదు వేల ఓటర్లతో నగరపాలక సంస్థలో డివిజన్లను ఏర్పాటు చేయడంతో కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలువడం అందరికీ సాధ్య కాదని, వార్డుసభ్యులేకాదు ఉప సర్పంచ్, సర్పంచ్, ఎంపీటీసీ స్థాయి నాయకులు పోటీకి జంకుతున్నారు. విలీనంతో తమ పదవులు ఊడడమే కాకుండా రాజకీయ భవిష్యత్ లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో విలీన గ్రామాల్లో మున్సిపల్ ఎన్నికలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు వస్తాయి.. ఇప్పట్లో ఉంటాయా, ఎవరు పోటీచేస్తారు... డివిజన్ ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉంది... రిజర్వేషన్ ఏమైనా తెలిసిందా అంటూ నలుగురు కలిస్తే ముచ్చటిచుకుంటున్నారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్: నగరంలోని సంతోష్ నగర్‌లోని సంతోషిమాత దేవా లయం 35వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ కొక్కిరాల సాగర్‌రావు పూజలు చేశారు.

హుజూరాబాద్‌రూరల్: మండలం లో గ్రామ పాలన అధికారుల సంఘం అధ్యక్షుడిగా బోళ్ల రాజు, ప్రధాన కార్య దర్శిగా పుట్ట విజయలక్ష్మి, ఉపాధ్య క్షులుగా నారాయణపురం రాజు, కోశాధి కారిగా కొలకాని రాజు, ఆర్గనైజర్‌గా వేముల సరిత, సభ్యులుగా మేకల సునీత, సుమలత, ఉడుత అనూష, ప్రశాంత్‌కుమార్, అంతడుపుల రాజు, భాస్కర్, బైరి గణేష్ ఎన్నికయ్యారు.

చొప్పదండి: కేంద్ర విద్యాశాఖ, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్ సంయుక్తంగా దేశవ్యాప్తంగా శుక్రవారం నవోదయ విద్యాలయాల్లో గ్రామసభ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగంగా స్థానిక నవోదయ విద్యాల యంలో 9వ తరగతి విద్యార్థులు గ్రామ సభను నిర్వహించారు.

చిగురుమామిడి: ప్రజలు చట్ట విరుద్ధ కార్యలాపాల్లో పాల్గొనవద్దని తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నముల్కనూర్, పీచుపల్లి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎస్సై సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వివిధ గ్రామాల 30 మంది రౌడీషీటర్లను, బెల్టుషాపుల యాజమా నులను శుక్రవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

కరీంనగర్ కల్చరల్: స్థానిక యజ్ఞ వరాహక్షేత్రంలో డిసెంబరు 16వ తేదీ నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

హుజూరాబాద్: బేడు బుడగ జంగం జన సంఘం హుజూరాబాద్ మండల నూతన కమిటీని శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు వేణు ఆధ్వర్యంలో ఎన్నుకు న్నారు. డివిజన్ గౌరవ అధ్యక్షుడిగా రామస్వామి, డివిజన్ అధ్యక్షుడిగా సాం బయ్య, డివిజన్ కార్యవర్గ సభ్యుడిగా గంగరాజు, మండలాధ్యక్షుడిగా స్వామి, తదితరులను ఎన్నుకున్నారు.

గంగాధర: మండలంలో వర్క్ సైట్ పిల్లలను గుర్తించి స్కూల్లో చేర్పించడా నికి సర్వే చేస్తున్నట్లు ఎంఈవో ప్రభాకర్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని ఇటుక బట్టీలలో పని చేస్తున్న పిల్లలను గుర్తించారు.

పంచాయతీలపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేస్తే గెలుపు సాధ్యమని, పట్టింపులకు పోకుండా పంచాయతీల్లో పట్టు సాధిం చడంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ అన్నారు. మండ లంలోని ఎల్ఎండీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయ కులతో శుక్రవారం పంచాయతీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రచార కార్యక్రమాలపై సూచించారు.

మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎమ్మెల్యే మహాత్మానగర్‌లోని పలు వార్డులలో పర్యటించారు. ప్రజల సమస్యలను తెలు సుకున్నారు. ప్రధానంగా వీధి కుక్కల సమ స్యతో ఇబ్బంది పడుతున్నట్లుగా ప్రజలు చెప్పడంతో అధికారులతో మాట్లాడి సమ స్యను పరిష్కరించాలని ఆదేశించారు.

కొత్తపల్లిలో 17,767 మంది ఓటర్లు

భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలో ఆసిఫ్‌నగర్, ఎలగందల్, కమాన్‌పూర్, బద్దిపల్లి, నాగులమల్యాల, ఖాజీపూర్ గ్రామ పం చాయతీలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా 17,767 ఓటర్లకు మహిళా ఓటర్లు 8733 మంది, పురుషులు 9034 మంది ఉన్నారు. ఆసిఫ్‌నగర్‌లో 12 వార్డుల్లో మహిళా ఓటర్లు 2595 మంది, పురుషులు 2641 మంది మొత్తం 5236 మంది ఓటర్లు ఉన్నారు. బద్దిపల్లిలో 8 వార్డుల్లో మహిళా ఓటర్లు 733 మంది, పురుషులు 813 మంది మొత్తం 1546 మంది ఉన్నారు. ఎలగం దల్‌లో 12 వార్డుల్లో మహిళా ఓటర్లు 2073 మంది, పురుషులు 2156 మంది ఉన్నారు. కమాన్‌పూర్‌లో 10 వార్డుల్లో మహిళలు 1384 మంది, పురుషులు 1398 మంది మొత్తం 2782 మంది ఓటర్లు ఉన్నారు. ఖాజీపూర్‌లో 8 వార్డుల్లో మహిళలు 729 మంది, పురుషులు 781 మంది మొత్తం 1510 మంది ఓటర్లు ఉన్నారు. నాగుల మల్యాలలో పది వార్డుల్లో మహిళలు 1219, పురుషులు 1245 మంది ఓటర్లు ఉన్నారు. మండల వ్యాప్తంగా మహిళా ఓటర్ల కంటే పురుషుల్లే అధికంగా ఉన్నారు.

గన్నేరువరంలో నామినేషన్ల స్వీకరణకు ఐదు కేంద్రాలు

గన్నేరువరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఐదు క్లస్టర్లుగా విభజించి కేంద్రాలను ఏర్పాటు చేయ నున్నారు. గన్నేరువరం క్లస్టర్‌లో గన్నేరువరం, చొక్కారావు పల్లి, చాకలి వానిపల్లి, యాస్వాడ, హన్మాజిపల్లి క్లస్టర్‌లో మైలారం, సాంబాయి పల్లె, హన్మాజిపల్లి, ఖాసింపేట క్లస్టర్‌లో మాదాపూర్, పారువెల్ల, ఖాసింపేట, గునుకులు కొండాపూర్ క్లస్టర్‌లో చీమలకుంటపల్లి, గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, గుండ్లపల్లి స్టేజి, జంగాపల్లి క్లస్టర్‌లో గోపాలపూర్, జంగాపల్లి, పీచుపల్లి గ్రామాలు ఉన్నాయి. మొత్తం 17 గ్రామాల సర్పంచ్, 140 వార్డు స్థానాల నామినేషన్ పత్రాలను కేంద్రాల్లో స్వీకరించనున్నారు.

ఏకగ్రీవంవైపు శ్రీరాములపల్లి పంచాయతీ

చొప్పదండి(రామడుగు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలోని శ్రీరాములపల్లి గ్రామ పంచాయతీ ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గ్రామస్థులు సమావేశమై సర్పంచ్‌తోపాటు 8 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవం చేసుకునేందుకు నిర్ణయించినట్లు సమాచారం. సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది. రెండు రోజులుగా ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు.

రేణికుంట వద్ద పోలీసుల తనిఖీలు

తిమ్మాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రేణికుంట టోల్‌గేట్ సమీపంలో రాజీవ్ రహ దారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు మానేరు విద్యార్థి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లో ఈ నెల 29 నుంచి డిసెంబరు 1 వరకు నిర్వహించనున్న 69వ రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్-17 బాలబాలికల రగ్బీ చాంపియన్‌షిప్ పోటీ లకు నగరంలోని మానేరు విద్యాసంస్థల విద్యార్థి ఎంపికయ్యాడు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో మ్యాకల ప్రణయ్ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. విద్యార్థిని విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, జహేదా, తిరుపతి, స్వామి అభినందించారు.

కుర్ర తిరుపతికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శ

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ కుర్ర తిరుపతిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శుక్రవారం పరామర్శించారు. కుర్ర తిరుపతి భార్య మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామ కృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ సంతాపం ప్రకటించారు.

అలుగునూర్ వాసికి డాక్టరేట్

తిమ్మాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్‌కు చెందిన తొర్తి నవీన్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం నంచి డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఆంగ్ల విభాగ అధిపతి ప్రొఫెసర్ నవీన్ సౌద పర్యవేక్షణలో డయోస్పోరిక్ ఎలెమెంట్స్ అండ్ సెన్సిబిలిటీస్ ఇన్ సెలెక్ట్ వర్స్ ఆఫ్ అమితవ్ ఘెష్, రోహింటన్ మిస్త్రీ అండ్ అమిత్ చౌదురి అనే అంశంపై పరిశోధన చేశారు. నవీన్ ప్రస్తుతం హైదారాబాద్ మల్లారెడ్డి కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు వాగేశ్వరి విద్యార్థులు

తిమ్మాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి ఇంజ నీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26న జరిగిన జిల్లా స్థాయి జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 29,30వ తేదీల్లో హైదారాబాద్‌లోని ఓవైసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వాగేశ్వరి కళాశాల జనరల్ సెక్రెటరీ గంద్ర శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

గణేష్‌నగర్‌లో శుక్రవారం సభ

హుజూరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం లోని గణేష్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా హింస నిర్మూలన దినోత్సవంలో భాగంగా శుక్రవారం సభ నిర్వహించారు. డిప్యూటీ డీప్యూటీ డీఎంహెచ్‌వో చందు, మెడికలాఫీసర్ డాక్టర్ తులసీ దాస్, డాక్టర్ జరీనా, సీడీపీవో సుగుణ, ఐసీడీఎస్ రమ్య పాల్గొన్నారు.

వేసెక్టమీ ఆపరేషన్‌తో నష్టం లేదు

సుభాష్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వేసెక్టమీ ఆపరేషన్‌తో పురుషుల ఆరోగ్యానికి నష్టం ఉండదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శనివారం వేసెక్టమి అవగాహన శస్త్ర చికిత్స పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న కుటుంబ నియంత్రణ వేసెక్టమి శిబిరాన్ని శుక్రవారం పరిశీలించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనాజవేరియా, మహ్మద్ అలీం తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా జనరల్ ఆసుపత్రిలో 7, జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 6 మొత్తం 13 మందికి వేసెక్టమి ఆపరేషన్ చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ శిబిరాలు డిసెంబరు 4 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జమ్మికుంట: కుటుంబ నియంత్రణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. శుక్రవారం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కుటుంబ నియంత్రణ శిబిరాన్ని పరిశీలించారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): దీక్షా దివస్‌ను విజయవంతం చేయా లని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. శుక్రవారం బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో రూపొందిం చిన బీఆర్ఎస్ దీక్షా దివస్ పోస్టర్‌ను క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరిం చారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ ఆమరణ దీక్షకు కరీంనగర్ నుంచి బయల్దేరిన రోజు సందర్భంగా శాత వాహన యూనివర్శిటీ ఎదుట శనివారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మె ల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ ఎస్వీ యూనివర్శిటీ ఇన్‌చార్జి చుక్కా శ్రీనివాస్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న మాజీ మేయర్ సునీల్‌రావు

గంగాధర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, సర్పంచ్‌లుగా బీజేపీ మద్దతుదారులను గెలిపించాలని మాజీ మేయర్ సునీల్‌రావు కోరారు. శుక్రవారం గంగాధర మండలంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3వేల కోట్లు రావాల్సి ఉంద న్నారు. బీజే బలపరుస్తున్న అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాల అభివృద్ధికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన కోటాలో రూ.10 లక్షలు అభివృద్ధికి కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అసెంబ్లీ కన్వీనర్ శ్రవణ్ కుమార్, మండలాధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా తెచ్చిన నిధులతోనే కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి ఒక్క పైసా ఖర్చు చేయలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాస సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు కేంద్ర మంత్రి బండి సంజయ్ సహ కారంతో ప్రతీ గ్రామంలో ఏదో ఒక పథకం కింద అభివృద్ధి చేశారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి, నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిం చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. చొప్పదండిలో ముఖ్య నాయకుల సమావే శంలో మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్, పట్టణ అధ్యక్షుడు చిల్ల శ్రావణ్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య నర్సరీ

● పాములతో స్థానికుల భయాందోళన

సైదపూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని బీసీ కాలనీలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో గ్రామ పం చాయతీ అధికారులు నర్సరీ ఏర్పాటు చేశారు. అందులో మొక్కలను పెంచుతు న్నారు. ఏపుగా పెరగడంతో నాటేందుకు తరలించక పాములకు ఆవాసాలుగా మారాయి. నర్సరీలో నుంచి పాములు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు భయాం దోళనకు గురవుతున్నారు. ఇప్పటికి రెండు మూడు సార్లు ఇళ్లలోకి వచ్చాయని వాపోతున్నారు. నర్సరీ చుట్టు పక్కల ఇళ్లలో ఉన్న తమకు పాముల భయం ఉం దని, పిల్లలు ఆడు కుంటారని పేర్కొ న్నారు. ప్రమాదాలు జరగకముందే అధి కారులు స్పందించాలని, నర్సరీని మారో చోటికి తరలించాలని కోరుతున్నారు.

జానపద సకల వృత్తి కళాకారుల సంఘం ఆవిర్భావ సదస్సు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కళాభారతిలో శుక్రవారం తెలంగాణ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం ఆవిర్భావ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతజ్ఞుడు గిటార్ రావు మాట్లాడుతూ జానపద కళలను భావి తరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతకుముందు మహాత్మా జ్యోతీబాఫూలే, అండెశ్రీకి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా తెలంగాణ జేఏసీ చైర్మన్ బొంత వెంకటమల్లయ్య, రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య, సంఘసేవకుడు వలస సుభాష్‌చంద్రబోస్, తేలు విజయ, కోడూరి పరశురాంగౌడ్, తిరుమల, నిర్మల, మమత, రమాదేవి, అనసూర్య, కలర్ సత్తన్న, చంద్రమౌళి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పతకాలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించినట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సంఘం అధక్ష్య, కార్యదర్శులు అంతటి శంకరయ్య గౌడ్, శ్రీధర్ రెడ్డి తెలిపారు. యూత్ కేటగిరిలో భాను ప్రసాద్ రజతం, చరణ్ సాయి, శృతి, కార్తిక్, సాయి విఘ్నేష్, చంద్ర ప్రకాష్ కాంస్యం గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి అభినందించారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

హుజూరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను శుక్రవారం దమనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అంటే కౌశిక్‌రెడ్డికి భయమని, అందుకే కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ సమయంలో సీఎం ఫొటో లేకుం డా చెక్కులు పంచుతున్నారని, అది భయం కాదా? అని అన్నారు.

జమ్మికుంట: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకుడు సాయిని రవి ఆధ్వర్యంలో జమ్మికుంట గాంధీ చౌరస్తాలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అంతకుముందు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

భూపతికి జాతీయ ఉత్తమ కార్టూనిస్టు అవార్డు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్థ అన్‌ఫోల్డ్ డ్రీమ్స్ ఆన్‌లైన్ డెలివరీ అంశం ఆధారంగా ఇటీవల నిర్వహిం చిన ఆన్‌లైన్ కార్టూన్ పోటీల్లో కరీంనగర్‌కు చెందిన టి.భూపతికి ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు అందుకున్నారు. భూపతి శంకరపట్నం మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయు డిగా పని చేస్తూ విద్యార్థులను కార్టూన్ రంగంలో ప్రోత్సహిస్తున్నారు. కలెక్టర్ పమేలాసత్పతి, డీఈవో శ్రీరాం మొండయ్య అభినందనలు తెలిపారు.

అల్ఫోర్స్‌లో వండర్ వరల్డ్ ఫెస్ట్



చిన్నారులతో అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రీ ప్రైమరీ బ్లాక్‌లో వండర్ వరల్డ్ ఫెస్ట్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లా డారు. వీఎస్ఆర్ ఎయిర్‌లైన్, అల్ఫోర్స్ ఫైర్‌లెస్ రెస్టారెంట్, కమ్యూనిటీ హెల్పర్స్ విషయాలపై వివరణ ఇచ్చారు. విద్యార్థు లకు ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్స్ అంటే ఏమిటో అవగాహన కల్పిం చారు. కమ్యూనిటీ హెల్పర్స్ అనగా డాక్టర్లు, రైతులు, టీచర్లు, సైనికుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

శ్రీచైతన్య విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి

తిమ్మాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. హైదారాబాద్ ఇన్ఫోసిస్, హెచ్ డీఎఫ్‌సీ లైఫ్, ప్రతిరాజ్ మెటల్ మాస్టర్స్ కంపెనీలు నియామ కాలు చేపట్టాయి. పలువురు సిస్టమ్ ఇంజనీర్లుగా, ఎగ్జిక్యూటీవ్ ట్రైనీ, జీఈటీ, హెచ్ఆర్ మేనేజర్లుగా ఉద్యోగాలు సాధించినట్లు చైర్మన్ తెలిపారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, ఏవో రామారావు, మీడియా ఇన్‌చార్జి రమేష్ అభినందించారు.

కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కరీంనగర్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచా యతీ ఎన్నికల నామినేషన్లు కొనసాగుతున్నాయి. కరీంనగర్ రూరల్ మండలంలో రెండో రోజు శుక్రవారం సర్పంచ్ స్థానాలకు 25 మంది, వార్డులకు 63 మంది నామినేషన్లు సమర్పించారు. చామనపల్లిలో 3, బహదూర్ ఖాన్‌పేట 2, ఫకీర్‌పేట 1. చెర్లబూత్కూర్ 6, తహెర్ కొం డాపూర్ 2, నల్లగుంటపల్లి 3, మొగ్దుంపూర్ 1, మందులపల్లి 2, ఇరు కుల్ల2, నగునూర్ 2, జూబ్లీనగర్ ఒకటి చొప్పున దాఖలయ్యాయి. రెండు రోజుల్లో సర్పంచ్ 35, వార్డులకు 73 నామినేషన్లు వచ్చాయి.

చొప్పదండి: చొప్పదండి మండలంలో సర్పంచ్ స్థానాలకు 30 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆర్నకొండలో 6, మంగళపల్లి 1, రాగం పేట 4, పెద్దకుర్మపల్లి 1, కోనేరుపల్లి 2, గుమ్లాపూర్ 3, చాకుంట 2, కొలిమికుంట 1, సాంబయ్యపల్లి 1, భూపాలపట్నం 2, వెదురుగట్టు 3, చిట్యాలపల్లి 3, రేవెల్లి ఒకటి చొప్పున వేశారు. వివిధ పంచాయతీల్లో వార్డులకు 69 నామినేషన్లు దాఖలయ్యాయి. రుక్మాపూర్ 4, చాకుంట 8, కొలిమికుంట 2, కాట్నపల్లి 3, వెదురుగట్టు 2, ఆర్నకొండ 15, మంగ ళపల్లి 5, గుమ్లాపూర్ 5, కోనేరుపల్లి 3, భూపాలపట్నం 6, చిట్యా లపల్లి 5, రాగంపేట 6, పెద్దకుర్మపల్లి 2, రేవెల్లి 3 దాఖలయ్యాయి. రెండు రోజుల్లో సర్పంచ్ 48, వార్డులకు 80 నామినేషన్లు వచ్చాయి.

● రామడుగు మండలంలో సర్పంచ్ స్థానాలకు 47, వార్డు స్థానాలకు 130 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ కొరటపల్లి 3, గోలిరామయ్యపల్లి 1, మోతె 1, గోపాల్‌రావుపేట 3, గుండి 2, కొక్కెర కుంట 2, దేశరాజ్‌పల్లి 1, వన్నారం 3, లక్ష్మీపూర్ 1, వెంకట్రావుపల్లి 2, రామడుగు 8, తిర్మలాపూర్ 2, రాంచంద్రాపూర్ 3, చిప్పకుర్తి 4, షానగర్ 3, కిష్టాపూర్ 1, రుద్రారం 1, రంగసాయిపల్లి 1, దత్తోజిపేట 1, వెదిర 3, వెలిచాల 1 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు స్థానా లకు 130 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 74, వార్డు స్థానాలకు 142 నామినేషన్లు వచ్చాయి.

గంగాధర: గంగాధర మండల వ్యాప్తంగా 71 సర్పంచ్ స్థానాలకు, 214 వార్డు స్థానాలకు దరఖాస్తులు సమర్పించారు. ఆచంపల్లిలలో సర్పంచ్‌కు 3, వార్డు 5, చిన్నాచంపల్లి సర్పంచ్ 1, వార్డు 7, ఒద్యారంలో సర్పంచ్1, వార్డు 2, బూరుగుపల్లిలో సర్పంచ్ 1, వార్డు 10, ముప్పిడి నర్సంహులపల్లి 3, వార్డు 4, నర్సింహులపల్లి సర్పంచ్1, వార్డు 8, లింగంపల్లి వార్డు 2, గంగాధర సర్పంచ్ 3, వార్డు 24, లక్ష్మీదేవిపల్లి సర్పంచ్‌కు 7, వార్డు 8, మధురానగర్ సర్పంచ్ 3, వార్డు 15, మంగపేట సర్పంచ్ 2, వార్డు 5, నారాయణపూర్ సర్పంచ్ 3, వార్డు 7, చర్లపల్లి(ఎన్) సర్పంచ్ 3, వార్డు 7, నాగిరెడ్డి పూర్ సర్పంచ్3, వార్డు 10, ర్యాలపల్లి సర్పంచ్ 1, వార్డు 8, కొండ య్యపల్లి వార్డు 3, చర్లపల్లి(ఆర్) సర్పంచ్ 4, వార్డు 5, కాచిరెడ్డిపల్లి సర్పంచ్ 1, వార్డు5 , ఇస్లాంపూర్ సర్పంచ్ 3, వార్డు వార్డు, వెంకటయ్యపలి సర్పంచ్_3, వార్డు 9, కురిక్యాల సర్పంచ్‌కు 1, వార్డు 10 , కొండన్నపల్లి సర్పంచ్ 2, వార్డు 3, ఉప్పరమల్యాలలో సర్పంచ్ 2, వార్డు 10, వెంకంపల్లిలో సర్పంచ్ 3, వార్డు 4 , రంగరావుపల్లిలో సర్పంచ్1, వార్డు 6, మల్లాపూర్ సర్పంచ్ 3, వార్డు 6, గోపాల్‌రావుపల్లి సర్పంచ్2, వార్డు4, కాసారం సర్పంచ్ 1, వార్డు 3 చొప్పున నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

● పరిశీలించిన అదనపు కలెక్టర్

భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్, ఎలగందల్ నామి నేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే శుక్రవారం పరిశీలించారు. రెండోరోజు సర్పంచులకు 21, వార్డు సభ్యులకు 67 నామినేషన్‌లు దాఖలయ్యాయి. రెండు రోజుల్లో సర్పంచులకు 33, వార్డు సభ్యుల స్థానాలకు 88 నామినేషన్‌లు వచ్చాయి.